"శారదా! అర్జంటుగా రావాలి ... టైం ఎంతైందో చూశావా!"

"ఏమిటట తొందర!"

"నా చదువు అయిపోయిందోయ్."

"అయితే ..."

"ఇక నీ పనులు పూర్తిచేసుకొని రావచ్చు— అని."

"రాకపోతే ఏమవుతుందట!"


"పొద్దెక్కితే మల్లెలు వాడిపోతయి. వాస నాస్తయ్యా, చస్తయ్యా!"


"ఆ ... తెచ్చారు లెండి మహా మల్లె పూలు."

"వాటి కేమైందీ... ప్రత్యేకంగా మోండా కెళ్ళి మరీ తెచ్చాను."

"ఆ ... మీరు వీటికోసరం ప్రత్యేకంగా వెళ్ళి ఉంటారూ? ఎవడో ఏదో కొనటానికి రమ్మనమని ఉంటాడు. ఆయనకోసరం వెళ్ళి ఉంటారు. ఆ పైన ఆయన ఆ పూలు కొంటూ 'నువ్వూ కొనవా నాయినా' అని ఉంటాడు. ఇక తప్పక కొని ఉంటారు."

"పెద్ద ... నేను పూలు కొననట్లు ... నువ్వు






పెట్టుకోనట్లు ... తొందరగా తెములు."

"ఉండండీ... ఏమి టా గోల ... రేపు మొదటి శుక్రవారం ... దేవుడి గూడు దగ్గరన్నా కడగాలా, వద్దా?"

"ఒక రోజు ముందు కడుక్కోకపోతే ఆ దేవుడికి కోపం రాదులేవే ... రా!"

"ఎవరన్నా వింటే నవ్విపోతారు ... చిన్నపిల్లాడిలా ఏమి టా గొడవ ... నెత్తికి ముప్పయి ఏళ్ళు వచ్చినయి."

"అబ్బా ... సరేలేవే ... పూలు ఎలా ఉన్న య్యంటావ్. మరువం గూడా తెచ్చాను చూశావా!"

"చూశారులే సంబడం. ఎల్లుండే పరీక్ష. ఇంకో గంట చదువుకోండి. ఈ లోగా నా పనులు పూర్తవు తయి!"

"ఇంకా గంటేం చేస్తావే!"

"మెడకు తాడేసుకుని ఉరేసుక చస్తా!"

"లక్ష్మివారం పొద్దు... ఏమి టావెధవ్వాగుడు."

"లేకపోతే ... నడుములు పట్టుకుపోయి నేను చస్తుంటే ఏమిటి గోల. పనిలో సాయం చేయక పోంగా అడ్డంకులు!"

"ఖర్మరా,నాయినా,ఖర్మ. పరాయితల్లి కన్నబిడ్డను ఇలా ఏడిపించడం సబబుగాదే!"

"నేనూ అదే అంటున్నాను."

"పాపం!"

"అయ్యో పాపం."

"సరేలే!"

"తెలుగు పాటలు వస్తున్నయ్యేల్లే ఉన్నది ... పెట్టండి విందాం!"

"మన డ్యూయట్లు చాల్లే ... ఇంకా ఆ రికార్డు లెందుకు?"

"పోనీయ్ నేను పాడేదా?"

"పెళ్ళి చూపుల నాడు చూశాగా సంబడం... హార్మొనియం పెట్టి ... అమ్మగారి అవతారం."

"అందుకనేనా మా చూరు పట్టుకు పదిహేను రోజులు వేలాడింది!"

"నేనేం గాదు. మీ నాయనే ... మా ఇంటి చుట్టూ చెప్పు లరిగేలా తిరిగింది."

"ఆ అరిగిన చెప్పుల కోసరమే గదా మీ వాళ్ళు కక్కుర్తిపడి పెళ్ళిలో కొట్టేసింది."

"పెళ్ళిలో మీ నాన్న చెప్పులు కొట్టేసింది మా వాళ్ళే నంటావ్!"

"ఏమో ... అంతా అనుకున్నారు ... నాకేం తెలుసు. హమ్మయ్యా! ఇప్పటి కయింది, బాబూ... దరిద్రపు గచ్చు ... దరిద్రపు గచ్చుని అద్దె కొంపలకి చివరిరకం రాళ్ళేయ్యక ... డబుల్ పాలిష్డ్ ఎక్కడ ఏస్తారు... ఏసినా ... అలాంటి కొంపల్లో మన మొఖాలకు అద్దెకు వో గదైనా దొరుకుతుందా అని!"

"చూస్తుండు అలాంటి ఇళ్ళే కొనేస్తాను."

"ఈ జన్మలో నేనా?"

"ఏం ఈ జన్మకేమైంది?"

"ఇల్లొద్దుగాని, నా కో బెంగుళూరు సిల్కు చీరె, మన బొట్టి ముండకు కంచిపట్టు జరీ అంచు పరికిణీ పట్టుకు రండి ... మీరు ఇల్లు కొన్నంత ఫలం!"

"అంత చేతకాని వాడి ననుకుంటున్నావా నేను."

"ఇల్లు కడగటం అయిందిగాని, కొబ్బరికాయ తెస్తాను అమ్మవార్ని చేస్తారా!"

"ఇప్పుడా?"

"ఏం ... ఇప్పు డేమయిందని... ఇప్పుడే చేసి పెట్టండి ... పిచ్చి ముండ నిద్ర లేచిందంటే ఇక మీరు చేసినట్టే!"

"నిద్ర వస్తున్నదే!"

"మా నాన్న ఎంత శ్రద్ధగా చేసిపెట్టేవాడో?"

"మీ నాన్నంత ముసలి వాణ్ణా ఏం?"

"కాదు. మా నాన్నంత తెలివి గల వారని.'

"మా నాన్నమాత్ర తెలివితక్కువ వాడనుకున్నావ్ యేం ?"

"మీ నాన్న సంగతి ఎవ్వడికి తెలియదు. అది కొంపల ముంచే తెలివి!"

"ఎవ్వడి కొంప ముంచా డేం?"

"మా నాన్నది ... అందుకనేగా మీ ఇంటపడింది నేను!"

"నీకేం తక్కువయిందట!"

"ఏముందని — అయిదోతనం తప్ప!"

"అదే ... ఏం తక్కువయిందీ అంటున్నాను."

"చెప్పాలా వేరే!"

"చెప్పకపోతే ఎలా తెలుస్తుంది."

"మీ నాన్నని పిలుచుకు రండి చెబుతాను. చెప్పటం కాదు కడిగేస్తాను."

"మధ్యలో ఆయ నేం చేశాడు?"

"మీలాంటి వాడిని కన్నందుకు!"

"నా కేమయిందట. ఆఫీసులో నా అంత మంచి వాడు, తెలివిగల వాడూ లేడని పేరు!"

"ఆడవాళ్ళకా, మగవాళ్ళకా!"

"శాంపిల్‌గా నీ కంటే అందమైన మా టైపిస్టు నడుగు."

"దానికి పెళ్ళయిందా?"

"నన్ను మించిన వాడు దొరికితేగాని చేసుకోదట."

"దొరక్కపోతే మీ పాలిటే పడదు గదా!"

"ను వ్వున్నావు గదా మధ్యలో!"

"నా దేముంది లెండి. నాలుగు నిద్రమాత్రలు పడేస్తే గుటుక్కు మంటాను. మిమ్మల్ని మూడు చెరువుల నీళ్ళు త్రాగించేటందుకు మా నాయన కేం చేతనవ్వు. అసలే తెలుగు మాస్టరు!"

"పోనీలే ఒకపని చేద్దాం!"

"కొబ్బరికాయ తెమ్మంటారా ... పసుపుగూడా కలిపి!"

"మధ్యలో ఆ గోలెందుకు?"

"అమ్మవారిని పట్టుకొని గోలంటారుటండీ! కళ్ళు పోతయి. రోడ్డు మీద పడి 'అమ్మా బాబూ!' అంటూ అడుక్కు తినాలి!"

"అందుకే అన్నాను — అమ్మవార్లని గురించి పొద్దు కూకిం తర్వాత మాట్లాడవద్దని."

"మరి పొద్దుగూకితేగాని టైపిస్టు అమ్మవారు మీకు గుర్తుకు రారు గదా!"

"సరే! ఇక నేను వదిలినా నువ్వు వదలవు గదా దాన్ని! కానీయ్ ... ఆవిడగారికి మన ముందు గది అద్దె కిద్దామా? — ఎవ్వరూ లేరట పాపం."

"ఎవ్వరూ లేకపోవడ మేం ఖర్మ! ... మీ రున్నారుగా ... ఆ రడుగుల మనిషి, అన్నీ ఆ అబ్బ పోలికలే!"

"మా నాన్న ఏం అలాంటి వాడు కాదు."

"తండ్రిని మించిన తనయు డన్న మాట."

"నోర్మూసుకో! ఎవ్వరన్నా వింటే నవ్విపోతారు."

"ఆ వైపు పిల్లను తెస్తే మిమ్మల్ని చూసే నవ్విపోతారు."

"ఏం నవ్వరు. అసూయతో చూడలేక కళ్ళు పొడుచుకు చావరూ జనమంతా ... పెద్దావిడ పాపం తెల్లవార్లూ వంటిల్లు కడుక్కుంటూ ఉంటుంది... అనీ, చిన్నావిడ మల్లె పూలు వాడనివ్వదూ అని."

"సంబడమే!"

"ఏం కాక!"

"ఏమండీ ... నీరు దిగిన రాళ్ళ దుద్దులు నా పెట్టెలో అడుగు నున్నాయి గానీ తీయండి కాస్త."

"అవి దేనికీ?"

"అమ్మవారి చెవులకు పెట్టరుటండీ!"

"అసలు సంగతి చెప్పు. వంటింటి తలుపులు వేసి వస్తావా ... అమ్మవార్లూ, అయ్యవార్లూ, అంటూ అక్కడే మటం వేస్తావా!"

"అవన్నీ అయితే గానీ నేను రానండీ!"

"దరిద్రపు మొఖం ... దరిద్రపు మొఖం అని ఒకళ్ళు చెప్పటం, ఇంకొకళ్ళు వినటం లేదు ఈ కొంపలో!"

"అదే నేనూ అంటున్నాను. పక్కింటి సుబ్బారాయుడు గారిని చూడండి... కొబ్బరికాయ పీచు దగ్గర నుంచి ఆయనే తీస్తాడు."

"నీకు తెలుసో, తెలియదో ... వంటిల్లు గూడా ఆయనే కడిగి ముగ్గులు పెడతాడు... ఆడంగిరేకుల వెధవ!"

"అవ్వ! ఏమి టానోరు. ఆయన గాని విన్నాడంటే చెప్పుచ్చుకు కొడతాడు."

"నువ్వు పరాయి మొగాళ్ళచేత నన్ను కొట్టిస్తావే.,టక్కులాడివి. నిన్నే కొట్టాలి ముందు."

"కొట్టండి చూద్దాం."

"కొట్టడం కాదు... నరికి పాతిపెడతాను."

"అందుకే పాతిక వేలిచ్చి మీ ఇంటి కొచ్చింది. నరికితే వూరుకుంటారు!"

"ఏం చేస్తావే ... ఏం చేస్తావూ అంట!"

"ఇదుగో ఇలా అయితే మీతో ఇంకొక్క క్షణం కాపురం చేయలేను. ఏట్లో దూకి చస్తా!"

"పక్కింటి సుబ్బారాయుడ్ని తోడు తీసుకు వెళ్ళు!"

"అమ్మమ్మమ్మ... ఏం ఆలోచన ఏం ఆలోచన? ఎర్రగా, బుర్రగా ఉంటుంది గదా అని ... ఆయన ముండ మోసిన పెళ్ళాన్ని ఇంట్లో తెచ్చి పెట్టుకుందామనా!"

"నీ నోటికి హద్దూ, పద్దూ ఉన్నదా?"

"మీ నోటికి ఉందా ఏం?"

"నువ్వంటే — నువ్వంటావు టే!"

"ఏం అనక ... నేనేం తక్కువని!"

"చెంపలు పగలకొడతాను!

"కొట్టండి చూద్దాం!"

"కొట్టడం గాదే ... పళ్ళు రాలగొడతాను..."

"రాలగొట్టండి చూద్దాం ... ఇదిగో నోరు తెరిచాను."

"శుక్రవారం పొద్దుయింది. చేయి లేవటం లేదు. చావు ముండ ... వెధవముండ అని!"

"మీరు బ్రతికుండగా నే నెలా వెధవముండ నవుతాను!"

"ఇస్కో అంటే— ఇస్కో అన్నాదట వెనకటి కో వెర్రి ముండ. అర్ధరాత్రవు తున్నది వంట ఇంట్లో లైటార్పు!"

"ఆర్పుతారులేండి!"


"తలుపు వేసేయ్!"

"వేస్తారు లెండి..."

"ఏమి టా నీలుగుడు ... వూ ... వెధవ ఆ కుళ్ళు గుడ్డలు మార్చుకో."

"మా నాన్న రెండొందలు పెట్టి కొన్న చీర కుళ్ళు గుడ్డా? మీ నాన్న ముప్ఫయి రూపాయిలు ఏడుస్తూ పడేసి కొన్న వెలిసిపోయిన చీర కంచి పట్టు చీరా!"

"వెధవ్వాగుడు వాగావంటే ఈ సారి నిజంగానే వాయిస్తాను — రెండు చెంపలూ ఎడాపెడా!"




"వాయిస్తే వూరుకుంటానా — అట్లకాడ కాలేస్తాను."

"అబ్బ ... ఆహా ... ఇప్పుడు చూడాలే నీ మొఖం. సత్యభామ ... అమ్మో... అపర సత్యభామ! లైటార్పు ఇంకెందుకూ!"

"మీ మొఖం ఉందిగా ... మన పక్కింటి..."

"పక్కింటీ లేదు ... వెనకింటీ లేదు. ముందు ఒక్కసారి తలుపులన్నీ చూసొచ్చి లైటార్పు!"

"తలుపులు మీరే చూసుకోండి. నాకు తెలియదు!"

"గాస్ ఆపావా!"

"ఆపకపోతేనే—మీకు పీడాపోతుంది. రేప్పొద్దున్న లేచి వెలిగించగానే నేనేగా చచ్చేది!"

"రే పొద్దునగా చచ్చేది. ఇప్పుడో మంచి చీరె కట్టుకు చావు!"

"కట్టుకుంటారు లెండి. బీరువాలో బండెడు చీరెలు మీరు కొన్నవన్నీ పది మూలుగు తున్నాయి గదా! ఏం కట్టుకో మంటారు చెప్పండి!"

"ఎర్రంచు తెల్ల చీరె ఉందిగా ... అది కట్టుకొని ఏడు ... ఆ పూలుగూడా పెట్టుకో!"

"పూలు పెట్టుకో ... పెట్టుకో ... అంటారే ఎలా పెట్టుకోవాలో తెలిసి ఏడిస్తేగా ... దండ కట్టాలా ..."

"ఇప్పటిదాకా కట్టనేలేదా!"

"పూళ్ళన్నీ చుట్టి, మీ రొచ్చేటప్పటికే ఏడయిందిగా ... పిండాకూడు వండి వార్చాలా ... కంచాలకి ఎత్తాలా ... ఇంకా పూలెక్కడ కట్టి చావాలి."

"సడిలే ... ఈ గదిలో ఆ పంచాంగం విప్పకుండా పూలు కట్టడం మొదలు పెట్టు... బుజ్జి ముండ లేచి కూర్చున్నదంటే— మళ్ళా తెల్లవారితే గాని నిద్రపోదు!"

'అప్పుడుగాని అయ్యగారి తిక్క కుదర్దు!"

"ఎందు కా నవ్వు?"

"ఆ దెయ్యం ముండ లేస్తే ఎంత బాగుంటుందో అని!"

"మళ్ళా నవ్వావంటే గొంతు పిసుకుతా!"

"ఏ మొగాడయినా పక్కగదిలో పెళ్ళాం నవ్వా లనుకుంటాడు గాని, ఇదెక్కడ చోద్యమండీ ... నన్ను నవ్వద్దంటారు!"

"నవ్వావులే గాని ... కట్టిన పూలు చాలు పెట్టుకో. పిగటా నాలుగా మన వెర్రిముండ కుంచు. పొద్దున్నే నీళ్ళు పోసుకుం తర్వాత పెట్టుకుంటుంది."

"హమ్మయ్యో! పూలం గోల అయింది. చీరె మార్చాలా ... లేక ..."

"ఆహా .. తప్పదు! ప్లీజ్ ...రే!"

"ఇవాళ్టికి ఫరవాలేదు లేండి, సార్ ... ఇప్పటికే పొద్దు పోయింది."

"ఉహూ ... లాభం లేదు, మేడమ్!"

"ఖర్మ! లైటార్పండి మరి!"

"నేను కళ్ళు మూసుకుంటాను గాని, కట్టేసుకోవే ... ను వ్వో చాదస్తం!"

"అబ్బ! ఆశ! పక్క గదిలో కట్టుకొస్తానుగాని... మన బంగారు ముండ లేస్తుందేమో ... చిచ్చి కొడుతూ కూర్చోండి!"

"అది లేవకుండా వుండాలే గాని ... ఎంత సేపయినా చిచ్చికొడుతూ కూర్చుంటాను! చేతులు నొప్పి పుట్టినా సరే!"

"సంతోషించాం ... తెలివికి ..."

"నీ బోడి తెలివికంటే నయమేలే నేను!"

"ఇదుగో... న ష్టమన్నా అన్నారంటే ... దాన్ని గిచ్చి మరీ లేపుతాను.

"నీకు దణ్ణం పెడతాను గాని, పోయిరావే వెధవ గోల!"

"అలా దారికి రాండి!"

"హాయిహాయిగా అహాహా దీన్నుంపతెగ. ఈ ముండ ఇప్పుడే లేచి కూర్చునేలా ఉన్నది. ఇదొకటి పానకంలో పుడకలాగా పగలంతా నిద్ర, రాత్రంతా ఏడుపు!"

"లేచిందా!"

"కలవరమాయే మదిలో నా మదిలో "

"హత్య ... ఖూనీ ..."

"ఎక్కడేవ్ ... మధ్యలో ఇప్పు డదెక్కడ...?"

"నా కిష్టమయిన పాటను నిలువునా ఖూనీ చేస్తున్నారు గదండీ!"

"లలల ... లలల ... లలలా ..."

"ఏమి టా పిచ్చిగోల... పిల్లముండ లేచిందాకా."

"సంతోషించారులే లైటార్పు!"

"మీరే ఆర్పండి... దీపా లార్పటం మా ఇంటా వంటా లేదు !"

"అలాగే ... ఆర్పుతాను ... ఏంచేస్తాను." ✤